క్లుప్తంగా

మినీ జాబ్‌మేళా విజయవంతం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

శిరివెళ్ల: యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో మంగళ వారం నిర్వహించిన మినీ జాబ్ మేళా విజయ వంతమయ్యింది. ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన మేళాలో 110 మంది పాల్గొనగా 24 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక య్యారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్ మెంట్ అధికారి సుబ్బారెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితం



తల్లీబిడ్డలను డిశ్చార్జి చేస్తున్న డాక్టర్ నాగేంద్ర

దొర్నిపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం అని వైద్యాధికారి నాగేంద్ర తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం గ్రామానికి చెందిన సుధారాణి అనే గర్భిణికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు చేశామన్నారు. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారన్నారు. దీంతో ఇప్పటికే ఈనెలలో ముగ్గురికి కాన్పు చేశామన్నారు. ఇంటి వద్ద ప్రసవాలు సురక్షితం కాదన్నారు. అందరికీ ఆరోగ్యశ్రీ కింద జీవన భృతి కోసం ఆసరా పథకం ద్వారా రూ.5వేలు బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు.

21న భూములపై అవార్డు ఎంక్వైరీ

ఉయ్యాలవాడ : నంద్యాల – జమ్మలమడుగు జాతీయ రహదారి కోసం ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి ఈ నెల 21న ఉదయం 9.30 గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అవార్డు ఎంక్వైరీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని బోడెమ్మనూరు, రూపనగుడి, మాయలూరు, అల్లూరు, పుచ్చకాయలపల్లె, నర్సిపల్లె గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన రైతులు సంబంధిత దస్తావేజు పత్రాలతో పాటు కంప్యూటర్ అడంగల్, 1బీ, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పాన్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో అవార్డు ఎంక్వైరీకి హాజరు కావాలని కోరారు.

నర్సాపురంలో తితిదే ధార్మిక పూజలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ధనుర్మాసం సందర్భంగా గ్రామంలోని లక్ష్మీనరసంహ్మస్వామి, రామాలయంలో తితిదే హిందు ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి గ్రామ పెద్దలతో కలిసి ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తితిదే ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు విశేష పూజలు, ప్రవచనాలు, భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పూజా కార్యక్రమాలకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, ధర్మ ప్రచార మండలి సభ్యులు వీరాంజనేయరావు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నంద్యాలకు చేరుకున్న శ్రీశైల మహాపాదయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న చంద్రస్వామి

నంద్యాల(వ్యవసాయం): తాడిపత్రి శ్రీబుగ్గరామలింగేశ్వర దేవస్థానం నుంచి ప్రారంభమైన శివస్వాముల శ్రీశైల 16వ మహాపాదయాత్ర మంగళవారం నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా నంద్యాలకు చెందిన శివస్వాములు వారికి స్వాగతం పలికారు. తాడిపత్రికి చెందిన గురుస్వామి చంద్రమోహన్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి తాడిపత్రి నుంచి శివస్వాములు పాదయాత్ర ద్వారా శ్రీశైలంకు చేరుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈనెల 16 నుంచి పాదయాత్ర ప్రారంభమైందని 23వ తేదీన శ్రీశైలం శ్రీమల్లికార్జున, శ్రీ భ్రమరాంబికా దేవిని దర్శించుకుంటామన్నారు. మహాపాదయాత్రలో దాదాపు 200మంది పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

శిరివెళ్ల: వనికినిదిన్నెకు చెందిన కుమ్మరి రమణయ్య ఈ నెల 4న వరి కోత మిషన్ కింద పడి మరణించాడు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్ బీమా కింద తక్షణం సాయంగా రూ. 10 వేలను భార్య సుహాసికి సర్పంచు తలారి బాల శరభయ్య అందచేశారు. మృతునికి రూ. 5 లక్షలు బీమా మంజూరవుతుందని, తక్షణ సహాయంగా రూ.10వేలు అందచేశామని, మిగతా సొమ్ము త్వరలోనే బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. ఉప సర్పంచు సుబ్బరాయుడు, రాంపుల్లయ్య పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- 32, 36 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



36వ వార్డులో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(సిటీ): రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం 32వ వార్డు బొమ్మలసత్రంలో వార్డు ఇన్‌చార్జ్ ఖాసీం ఆధ్వర్యంలో, సాయంత్రం పట్టణంలోని 36వ వార్డు రమానాథరెడ్డి నగర్‌లో వార్డు కౌన్సిలర్ శిల్పా నాగిని రవిసింగారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వార్డులలో జరిగిన మంచిని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజలకు ఆర్థిక స్థిరత్వం కోసం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులలో ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ వైపు నిలవాలి..

ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల పక్షాన నిలిచిన ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని, మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పేదలకు, పెత్తందారులకు జరిగే ఎన్నికల పోరులో పేదల పార్టీ వైపు ప్రజలంతా నిలవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వానికి, మా ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శశికళారెడ్డి, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీతఅమృతరాజ్, వైస్ చైర్మన్లు గంగిశెట్టిశ్రీధర్, పాంషావలి, పట్టణ అధ్యక్షుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, పున్న శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు వెల్లివిరుస్తున్నాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. నంద్యాల మండలం చాబోలు గ్రామంలో మంగళవారం మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ ముల్లా మహమ్మద్ హుసేన్ నివాసంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారు డీఎస్ హబీబుల్లా, వైఎస్సార్‌సీపీ యువజన సంఘం అధ్యక్షుడు పీపీ మధుసూదన్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన



ఆర్జీఎం కాలేజీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పరిశీలించారు. మంగళవారం సాయంత్రం పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజినీరింగ్ కాలేజీలలోని భవనాలను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి సందర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ పిదప ఈవీఎంలు భద్రపరిచేందుకు ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్‌కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు అవసరం అవుతాయని గుర్తించారు. వీటితో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. డీఎస్పీ మహేశ్వర రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు వారి వెంట ఉన్నారు.

పన్ను వసూళ్లలో అలసత్వం వీడాలి



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ అడ్మిన్లు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు పన్నుల వసూళ్లలో అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ రెవెన్యూ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో సచివాలయాల అడ్మిన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రాపర్టీ ట్యాక్స్, నీటి పన్ను, ఖాళీ స్థలాలపై విధించే పన్నులను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. అదేవిధంగా వార్డులలో సమస్యలను సత్వరమే గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపండి



ఆర్.జంబులదిన్నెలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న సీడీపీఓ

ఉయ్యాలవాడ : తల్లిదండ్రులు తమ పిల్లలను యథావిధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి తేజస్విని కోరారు. మంగళవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుతో కలిసి తనిఖీ చేశారు. కేంద్రంలో నిల్వ వున్న స్టాకు వివరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మెలో వుండడంతో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అందవలసిన పౌష్టికాహారం, పూర్వ విద్య దూరం కాకుండా ఉండేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులను ఇన్‌చార్జ్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. వారిచే కేంద్రాలను కొనసాగిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయదీప్తి, మహిళా పోలీస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటన

రుద్రవరం: సమస్యల పరిష్కారం కోసం మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు ఎనిమిది రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వారు రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దారు రవీంద్ర ప్రసాదును భిక్షమడిగి నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి గ్రామంలోని ప్రధాన రహదారిలో ర్యాలీగా వెళ్తూ భిక్షాటన చేశారు. ఇదిలా ఉండగా అధికారులు సచివాలయ ఉద్యోగులతో అంగన్‌వాడీ కేంద్రాలను తెలిపించి చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నారు.

ద్విచక్రవాహనాలపై శబరిమలైకు



శబరిమలైకి బయలు దేరుతున్న మాలధారులు

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయం నుంచి అయ్యప్ప మాలాధారులు మంగళవారం ద్విచక్రవాహనాలపై శబరిమలైకు బయలుదేరారు. మాల ధరించి నియమ నిష్టలతో 41 రోజుల పాటు అయ్యప్ప దీక్ష ఆచరించారు. గడువు ముగియడంతో వారు ఇరుముడి ధరించి గ్రామ శివారు వరకు నడుచుకుంటూ వెళ్లి.. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపై శబరిమలైకి పయనమయ్యారు.

26 నుంచి 'వికసిత్ భారత్'

ఉయ్యాలవాడ : మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26న ఆర్.పాంపల్లె, కొండుపల్లె, 27న సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె, 28న పెద్దయమ్మనూరు, ఇంజేడు, 29న ఉయ్యాలవాడ, రూపనగుడి, 30న సుద్దమల్ల, పడిగెపాడు, 31న నర్సిపల్లె, హరివరం గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. జనవరి 1న అల్లూరు, ఎస్.కొత్తపల్లె, 2న మాయలూరు, తుడుమలదిన్నె, 3న గోవిందపల్లె, బోడెమ్మనూరు, 4న కాకరవాడ, పుచ్చకాయలపల్లె గ్రామ పంచాయతీల్లో సంకల్ప యాత్రలను చేపడతామని చెప్పారు. గ్రామస్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్ర' కిట్ల పంపిణీ



ఆడుదాం ఆంధ్ర కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించిన ఆట వస్తువులను సంబంధిత సచివాలయ సిబ్బందికి మున్సిపల్ అధికారులు మంగళవారం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల పరిధిలోని 48 వార్డు సచివాలయాల వార్డు అడ్మిన్లకు క్రీడా వస్తువులను అందించారు. ఇందులో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్ క్రీడలకు సంబంధించిన కిట్లు ఉన్నాయి.

కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సంజీవనగర్ రామాలయంలో మంగళవారం టీటీడీ దివ్యప్రబంధ ప్రాజెక్టు నంది రైతు సమాఖ్య, శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలు మూడో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యత డాక్టర్ దీవీ హయ గ్రీవాచార్యులు గోదాదేవి మూడవ రోజు నిర్వహించే వ్రత పాశురాన్ని వివరించారు. శ్రీ మహావిష్ణువు వామనుడిగా జన్మించి బలిచక్రవర్తి అహంకారాన్ని అనిచివేసే విధానాన్ని గోపికలకు వివరిస్తున్న సన్నివేశాన్ని వివరించారు.

విద్యుత్ పొదుపుతో పర్యావరణ పరిరక్షణ



వెల్డింగ్ వర్క్‌షాపుల్లో వర్కర్లకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): విద్యుత్‌ను పొదుపుగా వాడటం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని నంద్యాల విద్యుత్ శాఖ ఏఈ రామయ్య సూచించారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలో వెల్డింగ్ షాపులు, పరిశ్రమలు, తదితర ప్రాంతాల్లో పని చేస్తున్న వర్కర్లకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ద్వారా భావి తరాలకు సమస్యలు లేకుండా చేయవచ్చన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే ఐక్యవేదిక లక్ష్యం

నంద్యాల(అర్బన్): ఉత్తమ సమాజ నిర్మాణమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పట్టణ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అధ్యక్షతన నంద్యాల పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రహీం మాట్లాడుతూ సమాజ హితం కోరే ప్రతి వ్యక్తి ఐక్యవేదికలో సభ్యత్వం తీసుకొని భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సౌజన్య, కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా నీలిమా తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, కోశాధికారి సత్యనారాయణ, ప్రసన్నకుమారి, రహంతుల్లా, అబ్దుల్‌మజీద్ పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో 12 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శశికళ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ...విజేతలకు ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేయటం జరుగుతుందని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో రాజేశ్వరి, విజయలక్ష్మి, లక్ష్మీ చైతన్య వ్యాసరచన ఆంగ్ల భాగంలో సాయికృష్ణ, సదాఫ్, నూర్‌మహమ్మద్, వక్తృత్వ ఆంగ్ల విభాగంలో సాయికృష్ణ, సదాఫ్, జ్యోతిర్మయి, వక్తృత్వ తెలుగు విభాగంలో అలి మాబి, రాజు, రాజేశ్వరి బహుమతులు సాధించినట్లు వెల్లడించారు.

దేశభక్తుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ బిన్‌లను అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు

చెత్త సేకరణకు ప్రత్యేక బిన్‌లు

నంద్యాల(సిటీ): పట్టణంలోని 42 వార్డులలో రోజువారీగా వెలువడుతున్న చెత్త సేకరణ కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక బిన్‌లను మంగళవారం అందించారు. స్థానిక మున్సిపల్ గ్యారేజ్‌లో కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా ఆధ్వర్యంలో బిన్లను పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి రోజూ గృహాల నుంచి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు డోర్ టు డోర్ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించేందుకు 800 బిన్‌లు అందజేశామన్నారు. ఇవి కార్మికులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



అశ్వఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అశ్వఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ అసమాన దేశ భక్త చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ముస్లిం ఐక్య దినోత్సవంగా జరుపుకోవాలని సీపీఎం నాయకులు మస్తాన్‌వలి, సీపీఐ నాయకులు బాబాఫకృద్దీన్, ఆవాజ్‌కమిటీ నాయకులు ముర్తుజా, రియాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 27ఏళ్ల వయస్సులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారతమాత ముద్దుబిడ్డ అశ్వఖుల్లాఖాన్ యువతకు ఆదర్శప్రాయుడిగా నిలిచి పోయారన్నారు.

యువతకు ఆదర్శం అశ్వఖుల్లాఖాన్

నంద్యాల(వ్యవసాయం): నేటి యువతకు అశ్వఖుల్లాఖాన్ నేటి యువతకు ఆదర్శమని ముస్లిం రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ రఫీ అన్నారు. స్థానిక రాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అబ్దుల్‌సమ్మద్, షేక్‌మహబూబ్‌బాషా, ఇసాక్‌వలి తదితరులు పాల్గొన్నారు. జాతీయ మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక క్రాంతిరేఖ గ్రంథాలయంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఇమ్రాన్‌పాషా, అబులైజ్, ఎస్ఎండీ సలీమ్, జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్యాండిల్‌లైట్ సర్వీస్



క్యాండిల్ లైట్ సర్వీసులో పాల్గొన్న క్రైసవులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–2(ఆల్ సెయింట్ చర్చి)లో మంగళవారం సాయంత్రం క్యాండిల్ లైట్ సర్వీసును పాస్టరేట్–2 డీనరీ చైర్మన్ రెవరెండ్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసు మార్గాన్ని అనుసరించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కొరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగైయున్నాడని క్రైస్తవుల విశ్వాసం అన్నారు. అందులో భాగంగానే చర్చిలో క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం క్వయర్ బృందం ఆలపించిన ప్రత్యేక భక్తి గీతాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో రెవరెండ్ విజయ్‌కుమార్, జోయెల్, సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో..

నంద్యాల పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం క్యాండిల్ లైట్ సర్వీసును పీటర్ పాల్ అధ్యక్షతన నిర్వహించారు. క్రిష్టియన్ జేఏసీ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మన్నెం జానయ్య, రిటైర్డు తహసీల్దార్ జేమ్స్, రిటైర్డు ఎస్ఐ సామేలు, ఆనందనం ఏసన్నలు పాల్గొని దైవ సందేశం వినిపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పుల్లా నరసింహులు పాల్గొన్నారు.

గంగవరం.. అభివృద్ధి పథం

- ఏళ్ల సమస్యలకు పరిష్కారం
- రూ. 3 .50 కోట్లతో గ్రామానికి తారు రోడ్డు
- రూ. 62 లక్షలతో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం
- మన బడి నాడు– నేడు కింద పాఠశాల అభివృద్ధి

శిరివెళ్ల: గంగవరం గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. రూ.కోట్లతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిష్కామయ్యాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- ఎన్నో ఏళ్లుగా గ్రామీణ రోడ్డు అధ్వానంగా ఉండేది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన రోడ్డు నిర్మాణానికి రూ. 3.50 కోట్ల మంజూరు చేసింది. దీంతో రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది.
- రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం జరిగింది. ప్రజలకు, రైతులకు మేలు జరుగుతోంది.
- రూ. 20 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరుకాగా.. ఎస్సీ, బీసీ కాలనీలలో సిమెంట్ రోడ్లు వేశారు.
- మన బడి నాడు– నేడు కింద ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలు మారాయి. రెండు విడతలుగా మంజూరయిన రూ.70 లక్షతో పాఠశాలకు ప్రహరీలు, 5 అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు.
- గ్రామస్తులకు సొంతి కల నెరవరింది. ఎన్నో ఏళ్ల నుంచి ఇంటి స్థలాల పంపిణీ జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి జన్మభూమిలో అర్జీలు పెట్టినా ఫలితం లేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాడికే జగనన్న కాలనీ కింద 89 మంది పేదలకు స్థలాలు పంపిణీ చేశారు. ఇళ్లు కూడ మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు 35 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.



గ్రామ సచివాలయ భవనం

అభివృద్ధి పనులు జరిగాయి

ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంలో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. సచివాలయం, ఆర్‌బీకే నిర్మాణాలు పూర్తియ్యాయి. రూ. 20 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీలో సిమెంట్ రోడ్లు వేశాం. రూ.3.50 కోట్లతో గ్రామానికి తారు రోడ్డు వేశారు. రూ.70 లక్షలతో ప్రాథమిక పాఠశాల అన్ని విధాలుగా అభివృద్ధి జరిగింది.

– చంద్రోశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి



గంగవరం గ్రామానికి వేసిన రోడ్డు



రైతు భరోసా కేంద్రం

సిమెంట్ రోడ్డు వేశారు



ఎస్సీ కాలనీలో 6 నెలల కితం సిమెంట్ రోడ్డు వేశారు. ఇంతకు ముందు వానాకాలంలో మట్టి రోడ్డుపై నడవ లేక ఇబ్బందులు పడేవారం. రాత్రి పూట రోడ్డుపై వెళ్లాలంటే భయంగా ఉండేది. ఇప్పుడు 34 కుటుంబాలకు ఆ బాధలు తప్పాయి. – సుశీలమ్మ

సొంతింటి కల నెరవేరింది



నాకు 12 ఏళ్ల కితం పెళ్లయ్యింది. అప్పటి నుంచి మేము మా అమ్మ ఇంట్లో ఉంటున్నాం. ఇరుకుగా ఉండటంతో ఇబ్బందిగా ఉండేది. టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థలం కోసం ప్రతి సంవత్సరం జన్మభూమి మీటింగ్‌లో అర్జీ పెట్టుకునేవాడిని. అలా 5 ఏళ్లు అర్జీలు పెట్టినా స్థలం మాత్రం రాలేదు. ఈ ప్రభుత్వంలో స్థలం వచ్చింది. ఇళ్లు కూడా ఇచ్చారు. నిర్మాణం కూడా పూర్తయ్యింది. – చిన్న ఉశేని

కోలుకోలేక వ్యక్తి మృతి

శిరివెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన దొర్నిపాడు మండలం డబ్ల్యూ కొత్తపల్లెకు చెందిన పగడాల రామసుబ్బయ్య (60) నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ నెల 17న రామసుబ్బయ్య స్వగ్రామం నుంచి వచ్చి నంద్యాలకు వెళ్లడానికి శిరివెళ్ల మెట్ట వద్ద బస్సు కోసం నిలబడ్డారు. ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాల వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. కుమారుడు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.